క్లుప్తంగా

ఇస్కాన్‌లో విద్యార్థులకు పోటీలు



విజేతలకు సర్టిఫికెట్లు అందజేస్తున్న టీఎంసీ సభ్యులు

సీటీఆర్‌ఐ: కృష్ణాష్టమిని పురస్కరించుకుని వారం రోజులుగా ఇస్కాన్‌లో పోటీలు కొనసాగుతున్నాయి. వాటిలో భాగంగా శనివారం విద్యార్థులకు తర్క పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా టెంపుల్‌ మేనేజ్‌మెంట్‌ కమిటీ (టీఎంసీ) సభ్యులు మాట్లాడుతూ విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికి తీసేందుకు, వారిలో సబ్జెక్టుపై ఎంత వరకూ అవగాహన ఉందో తెలుసుకోవడానికి ఈ తర్క పోటీలు ఉపయోగపడతాయన్నారు. 8 నుంచి 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు ఈ పోటీలు నిర్వహించి, వారికి సర్టిఫికెట్లు ప్రదానం చేశారు.

విద్యుత్‌కు నేడు అంతరాయం

రాజమహేంద్రవరం సిటీ: అత్యవసర మరమ్మతుల కోసం నగరంలోని పలు ప్రాంతాల్లో ఆదివారం విద్యుత్‌ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీఈపీడీసీఎల్‌ ఈఈ నక్కపల్లి శామ్యూల్‌ తెలిపారు. = ఉదయం 7 నుంచి 8 గంటల వరకూ నగరంలోని శాంతిపురం, అంబేడ్కర్‌ నగర్, కరుణ శ్రీ హాస్పిటల్‌ ఏరియా, ద్వారపూడి బట్టల కాంప్లెక్స్, అన్నపూర్ణమ్మపేట, ఆంధ్ర నగర్, బైపాస్‌ రోడ్, ఇండస్ట్రియల్‌ ఏరియా, తాడితోట సెంటర్, సంహిత డిగ్రీ కాలేజీ రోడ్, వైఎస్సార్‌ వాంబే గృహాల ఏరియాల్లో అంతరాయం కలుగుతుంది.

● ఉదయం 8 నుంచి 10 గంటల వరకూ గోకవరం బస్టాండ్, మునిసిపల్‌ కార్యాలయ పరిసరాలు, ఆర్యాపురం, తుమ్మలోవ, కోర్లమ్మపేట, ఆర్టీఓ కార్యాలయం, దేవీచౌక్, లక్ష్మీవారపుపేట, శేషయ్యమెట్ట ఏరియాల్లో విద్యుత్‌ ఉండదు.

వేధింపులపై ఫిర్యాదు చేయండి



కార్యక్రమంలో మాట్లాడుతున్న సౌత్‌జోన్‌ డీఎస్పీ భవ్య కిశోర్‌

కడియం: వేధింపులకు గురైతే వెంటనే ఫిర్యాదు చేయాలని విద్యార్థినులకు రాజమండ్రి సౌత్‌ జోన్‌ డీఎస్పీ భవ్యకిశోర్‌ సూచించారు. జిల్లా ఎస్పీ డి.నరసింహ కిశోర్‌ ఆదేశాల మేరకు శనివారం కడియపులంక జిల్లా పరిషత్‌ ఉన్నత పాఠశాలలో పోక్సో చట్టం,సైబర్‌ నేరాలు, గంజాయి, ఇతర మాదక ద్రవ్యాలు, కొత్తగా వచ్చిన చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కడియం ఇన్‌స్పెక్టర్‌ ఎ.వెంకటేశ్వరరావు, సబ్‌ ఇన్‌స్పెక్టర్‌ పట్టా ధనలక్ష్మి ప్రసన్న, శక్తిటీం పాల్గొన్నారు.

ఇళ్లు నిర్మించుకోకపోతే నగదు జమ చేయాలి

బిక్కవోలు: ఇళ్లు కట్టండి లేకపోతే నగదును జమ చేయండి అని లబ్ధిదారులతో ఇన్‌చార్జి హౌసింగ్‌ డీఈ వనమయ్య అన్నారు. మన ఇల్లు మన గౌరవం – గృహ లబ్ధిదారుల అవగాహన కార్యక్రమంలో భాగంగా బలభద్రపురం పంచాయతీ కార్యాలయంలో శనివారం ఆ గ్రామంలో లేఅవుట్‌ లబ్ధిదారులకు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈ వనమయ్య మాట్లాడుతూ ఇంటి నిర్మాణం చేస్తామని గ్రామంలో 204 మంది అడ్వాన్స్‌గా తీసుకున్నారన్నారు. వీరి ద్వారా రూ.38.30 లక్షలు ఇవ్వడం జరిగిందన్నారు. నిబంధనల ప్రకారం ఇంటి నిర్మాణ జరగాలని లేకపోతే ఆ నగదు జమ చేయాలన్నారు. దీనిపై పలువురు లబ్ధిదారులకు నోటీసులు అందజేశారు. కార్యక్రమంలోని ఇన్‌చార్జి ఎంపీడీవో నాగేంద్ర ప్రసాద్, సర్పంచి బుంగా రామారావు, మాజీ ఎంపీటీసీ నల్లమిల్లి వెంకట సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సినిమాలు



శ్యామల	: సార్‌ మేడమ్‌
సూర్య మినీ	: మహావతార్‌ నరసింహ
సూర్య ప్యాలెస్	: కింగ్‌డమ్‌
స్వామి	: హరిహర వీరమల్లు
అనుశ్రీ	: హరిహర వీరమల్లు
శివజ్యోతి	: సార్‌ మేడమ్‌
రాజా	: కింగ్‌డమ్‌
ఊర్వశి	: మహావతార్‌ నరసింహ
మేనక	: సన్‌ ఆఫ్‌ సర్దార్‌–2
రంభ	: జూనియర్‌
అప్సర	: కింగ్‌డమ్‌
అశోక	: కింగ్‌డమ్‌
నామవరం	
వీఎస్‌ మహల్‌	: కింగ్‌డమ్‌
ధవళేశ్వరం	
మురళీకృష్ణ	: కింగ్‌డమ్‌
కడియం	
వెంకట సూర్య	: కింగ్‌డమ్‌

జంక్షన్‌.. టెన్షన్‌

- స్పీడ్‌ బ్రేకర్లు లేక అవస్థలు
- ప్రమాదకరంగా కూడళ్లు
- వాహన చోదకుల అవస్థలు

కంబాలచెరువు: నగరంలోని పలు జంక్షన్లు ప్రజలను హడలెత్తిస్తున్నాయి. తరచూ ఆ ప్రాంతాల్లో ప్రమాదాలు నిత్యకృత్యాలుగా మారాయి. కుర్రకారు జోరుమీద, మెరుపువేగంతో ఎటువైపు ఏ వాహనం వస్తుందో అనే ఆలోచనకూడా లేకుండా రయ్‌ మంటూ బైక్‌లపై దూసుకుపోతున్నారు. వీరి సంగతి అటుంచితే, కూడళ్లకు ఆనుకుని ఉన్న ప్రధాన రహదారుల మీదుగా అతి వేగంగా వాహనాలు దూసుకురావడం, అదే సమయంలో కూడళ్లకు అనుకుని ఉన్న చిన్నపాటి వీధుల్లోంచి వాహనదారులు అదే సమయంలో ఒకేసారి రావడంతో అధిక ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. కొన్ని కూడళ్ల వద్ద జరిగిన ప్రమాదాల్లో పెద్దలు, చిన్నపిల్లలు సైతం మృత్యువాతకు గురైన సంఘటనలు ఉన్నాయి.

లాలాచెరువు సమీపంలో..

లాలా చెరువు సమీపంలోని వైఎస్సార్‌ విగ్రహం వద్ద ఉన్న జంక్షన్‌ అత్యంత ప్రమాద భరితంగా మారింది. సెంట్రల్‌ జైలు రోడ్డు నుంచి లాలా చెరువు, లాలా చెరువు నుంచి సెంట్రల్‌ జైలు వైపు రోడ్లలో నిత్యం వేల వాహనాలు తిరుగుతుంటాయి. ఇదే రోడ్డులో క్వారీ సెంటర్‌ వైపు నుంచి, లాలాచెరువు సర్వీస్‌ రోడ్డు నుంచి వాహనాలు అధిక సంఖ్యలో వస్తుంటాయి. దీంతో వైఎస్సార్‌ విగ్రహం వద్ద రద్దీ ఎక్కువగా ఉంటుంది. ఈ ప్రాంతంలో ప్రమాదాలు పరిపాటిగా మారాయి. రెండు వైపులా ఉన్న ప్రధాన రోడ్లలో వచ్చే వాహనాలను నియంత్రించేందుకు అక్కడ స్పీడు బ్రేకర్లు అవసరం. కానీ వాటిని ఏర్పాటు చేయలేదు. అధికారులు కనీసం ఆ దిశగా ఆలోచన చేయడం లేదు. ఆ ప్రాంతంలో స్పీడు బ్రేకర్లు ఏర్పాటు చేస్తే కొందరు ఈ ప్రమాదాల బారినుంచి తప్పించుకోవచ్చు.

ప్రమాదకరంగా గ్లో గార్డెన్‌ జంక్షన్‌

క్వారీకి వెళ్లే రహదారిలో గ్లో గార్డెన్‌ వద్ద ఉన్న జంక్షన్‌ ప్రమాదభరితంగా మారింది. ఈ ప్రాంతంలో ఉదయం, సాయంత్రం విపరీతమైన ట్రాఫిక్‌ ఉంటుంది. స్కూళ్లకు వెళ్లే ఆటోలు, బస్సులు, డ్యూటీలకు వెళ్లే వారి వాహనాలతో రద్దీగా మారుతుంది. ఈ ప్రాంతంలో స్పీడు బ్రేకర్లు లేవు. నాలుగువైపుల నుంచి వాహనాలు అతి వేగంతో కూడలిలోకి దూసుకువస్తుంటాయి. దీంతో రోజూ ప్రమాదాలు ఈ ప్రాంతంలో ఆనవాయితీగా మారాయి. ఈ జంక్షన్‌లో జరిగిన రెండు వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరు చిన్నారులు మృతి చెందారు. ఈ ప్రమాదాలను నివారించాలంటే లాలా చెరువు వైపు, క్వారీ వైపు గ్లో గార్డెన్‌కు సమీపంలో రెండు వైపులా రోడ్లకు స్పీడు బ్రేకర్లు ఏర్పాటు చేయాలి.



స్పీడ్‌ బ్రేకర్‌ లేక ప్రమాదకరంగా ఉన్న లాలాచెరువు సమీపంలోని గ్లో గార్డెన్‌ జంక్షన్‌

పాఠశాలల సమీపంలో..

నగరంలోని పాఠశాలలు ఉన్న చాలా ప్రాంతాల్లో స్పీడు బ్రేకర్లు లేవు. గోకవరం బస్టాండ్‌ వద్ద నున్న ఫైర్‌ స్టేషన్‌ జంక్షన్‌లోనూ ఇదే పరిస్థితి. ఈ జంక్షన్‌ను ఆనుకుని ప్రైవేట్‌ స్కూలు ఉంది. అక్కడ చదివే పిల్లలను తీసుకువచ్చే స్కూలు బస్సులు, చిన్నారుల తల్లిదండ్రుల వాహనాలతో కిక్కిరిసిపోయి ఈ ప్రాంతంలో ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇక్కడ ఉదయం నుంచి రాత్రి వరకు ఒకే రీతిలో ట్రాఫిక్‌ ఉంటుంది. ఇదే జంక్షన్‌లో రాత్రి ఏడయ్యిందంటే హైదరాబాద్‌ తదితర దూర ప్రాంతాలకు వెళ్లే బస్సులతో పూర్తి రద్దీగా మారిపోతుంది.

ప్రణాళికాబద్ధంగా చదివితే ఉత్తమ ఫలితాలు



విద్యార్థితో మాట్లాడుతున్న డీఈవో వాసుదేవరావు

కంబాలచెరువు: పదో తరగతి విద్యార్థులు ఇప్పటి నుంచే ప్రణాళికా బద్ధంగా చదవాలని, అప్పుడే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని జిల్లా విద్యాశాఖాధికారి కంది వాసుదేవ రావు అన్నారు. వంకాయలవారి వీధిలోని సిటీ నగరపాలక సంస్థ ఉన్నత పాఠశాలను శనివారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థుల అభ్యసన స్థాయిని పరిశీలించి సూచనలు చేశారు. ఎనిమిదో తరగతి విద్యార్థి శామ్యూల్‌ను డీఈవో దత్తత తీసుకున్నారు. అతడి డేటా నమోదు చేసుకున్నారు. విద్యార్థుల నోట్‌ బుక్స్‌ పరిశీలించారు. సిటీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు పి.దుర్గాప్రసాద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

భవిష్యత్తుకు మార్గదర్శిగా రతన్‌ టాటా హబ్‌



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్‌ ప్రశాంతి

రాజమహేంద్రవరం సిటీ: పారిశ్రామిక వేత్తలు, విద్యావేత్తలు, ఆవిష్కర్తలు ఒకే వేదికపై చేరిన నేపథ్యంలో రతన్‌ టాటా ఇన్నోవేషన్‌ హబ్‌.. భవిష్యత్తుకు గొప్ప మార్గదర్శిగా నిలవనుందని కలెక్టర్‌ పి.ప్రశాంతి అన్నారు. రాజమహేంద్రవరం ఆర్డీఓ కార్యాలయంలో శనివారం తూర్పుగోదావరి, కాకినాడ, ఏలూరు, కోనసీమ జిల్లాల పారిశ్రామిక వేత్తలతో ఆర్‌టీఐహెచ్‌ ఆధ్వర్యంలో రెండో సమీక్షా సమావేశం నిర్వహించారు. కలెక్టర్‌ మాట్లాడుతూ ఒక ఆలోచన కార్యరూపం దాల్చాలంటే ఇటువంటి వేదికలు కీలకమన్నారు. ప్రభుత్వ, ప్రైవేట్‌ రంగాల మద్దతుతో సహకార భావనతో ముందుకు సాగాలన్నారు. ఫుడ్‌ ప్రాసెసింగ్, ఐటీ, స్టార్టప్స్‌కు ప్రోత్సాహంతో ఆర్టీఐహెచ్‌ ద్వారా అనేక అవకాశాలు ఉన్నాయన్నారు. రాజమహేంద్రవరం కేంద్రంగా ఏర్పాటు చేస్తున్న రతన్‌ టాటా ఇన్నోవేషన్‌ హబ్‌ ద్వారా ఫుడ్‌ ప్రాసెసింగ్, ఐటీ, కోర్‌ టెక్, ఎంఎస్‌ఎంఈల అభివృద్ధికి విస్తృత అవకాశాలు అందుబాటులోకి రానున్నాయన్నారు. కార్యక్రమంలో జిల్లా జాయింట్‌ కలెక్టర్, ఆర్టీఐహెచ్‌ డైరెక్టర్‌ ఎస్‌.చిన్న రాముడు, గ్రీన్‌ కోర్‌ చైర్మన్‌ జి.రాంబాబు, నన్నయ యూనివర్సిటీ వీసీ వి.ప్రసన్న, ఆదిత్య యూనివర్సిటీ చైర్మన్‌ శేషారెడ్డి, గెయిల్‌ ప్రతినిధి కేవీఆర్‌ రావు, ఓఎన్జీసీ ప్రతినిధి కేవీకే రాజు, తాడేపల్లిగూడెం ఎన్‌ఐటీ ప్రతినిధి రవికిరణ్‌ శాస్త్రి, వైఎస్సార్‌ హార్టికల్చర్‌ యూనివర్సిటీ ప్రతినిధి శ్రీరామ్‌ పాల్గొన్నారు.

తల్లిపాలతో వ్యాధుల నుంచి రక్షణ



తల్లిపాల వారోత్సవాలలో మాట్లాడుతున్న వైద్యాధికారి జెస్సీ సుప్రియ

కడియం: తల్లిపాలతో పిల్లలకు వ్యాధుల నుంచి రక్షణ లభిస్తుందని కడియపులంక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్‌ జెస్సీ సుప్రియ అన్నారు. ఆమె ఆధ్వర్యంలో శనివారం ఆస్పత్రిలో ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్‌ సుప్రియ మాట్లాడుతూ బిడ్డ పుట్టిన గంటలోనే తల్లిపాలు తాగించాలన్నారు. బిడ్డ మెదడు చురుకుగా పనిచేయడంతో పాటు జ్ఞాపకశక్తి పెరుగుదలకు తల్లిపాలు దోహదపడతాయన్నారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు.

వివాహితపై లైంగిక దాడికి యత్నం

రాజమహేంద్రవరం రూరల్‌: ఇంటిలో ఒంటరిగా ఉన్న వివాహితపై పక్కింటిలో ఉండే వ్యక్తి లైంగిక దాడికి యత్నించాడు. శాటిలైట్‌ సిటీ గ్రామంలో శుక్రవారం ఈ ఘటన జరిగింది. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం శాటిలైట్‌ సిటీలోని ఇందిరానగర్‌లో 35 ఏళ్ల వివాహిత భర్త పనికి వెళ్లిపోవడంతో ఒంటరిగా ఉంది. పక్కింటిలో ఉండే గాడ లోవరాజు ఆ వివాహిత వద్దకు వచ్చి చెయ్యి పట్టుకుని అసభ్యకరంగా ప్రవర్తించాడు. దీంతో ఆమె అతడిని తోసివేసి ఇంట్లోంచి బయటకు వచ్చేసింది. లోవరాజు అక్కడ ఉన్న గొట్టంతో ఆమె చేతులపై కొట్టి చీర లాగాడు. దీంతో వివాహిత కేకలు వేయగా చుట్టుపక్కల మహిళలు రావడంతో లోవరాజు పరారయ్యాడు. ఈ ఘటనలో ఆమె చేతికి గాయం కావడంతో చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. దీనిపై వివాహిత భర్త శనివారం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో బొమ్మూరు ఎస్సై కె.రమేష్‌ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నిందితుడిని కఠినంగా శిక్షించాలి

వివాహితపై లైంగికదాడికి యత్నించిన నిందితుడిని కఠినంగా శిక్షించాలని వైఎస్సార్‌ సీపీ జిల్లా అధ్యక్షుడు చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, వైఎస్సార్‌ సీపీ అమలాపురం పార్లమెంటు పరిశీలకురాలు జక్కంపూడి విజయలక్ష్మి డిమాండ్‌ చేశారు. శనివారం మధ్యాహ్నం బాధితురాలిని వారు పరామర్శించారు. వైఎస్సార్‌ సీపీ అండగా నిలుస్తుందని భరోసా ఇచ్చారు.

మహనీయుల జీవితం స్ఫూర్తిదాయకం



బళ్లారి రాఘవ, పింగళి వెంకయ్య చిత్రపటాలకు పుష్పాంజలి ఘటిస్తున్న జేసీ చిన్నరాముడు తదితరులు

సీటీఆర్‌ఐ (రాజమహేంద్రవరం): మహనీయుల జీవితం స్ఫూర్తిదాయకమని జేసీ చిన్న రాముడు అన్నారు. పింగళి వెంకయ్య, బళ్లారి రాఘవ జయంతిని పురస్కరించుకుని కలెక్టరేట్‌ లో శనివారం వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ భారత జాతీయ పతాక రూపశిల్పి, స్వాతంత్య్ర సమరయోధుడు పింగళి వెంకయ్య త్యాగం చిరస్మరణీయమన్నారు. త్రివర్ణ పతాక రూపకల్పన సాధారణ విషయం కాదని, ఆ పని కోసం ఆయన ఐదేళ్లపాటు ప్రపంచ వ్యాప్తంగా వివిధ దేశాల జెండాలపై అధ్యయనం చేశారన్నారు. ఈ తర్వాత సుమారు 30 డిజైన్లను సమర్పించగా, అందులో త్రివర్ణ పతాకం ఎంపికై భారత జాతీయ పతాకంగా ఆమోదించబడిందన్నారు. ఆ ఘనత కృష్ణా జిల్లా భట్లపెనుమర్రులో జన్మించిన పింగళి వెంకయ్య చెందడం మనందరికీ గర్వకారణమన్నారు. అలాగే ఆంధ్ర – కర్ణాటక నాటక పితామహుడు బళ్లారి రాఘవ జయంతి సందర్భంగా నివాళులర్పించారు. బ్రిటిష్‌ పాలనా కాలంలోనే తన కళతో ప్రజల్లో ఉద్యమ స్ఫూర్తిని ప్రజల్లో నింపిన మహానుభావుడు రాఘవ అని గుర్తు చేశారు. అనేక సాంఘిక నాటకాల రచయితగా, ప్రజ్ఞాశీలిగా, నాటకరంగం మీద తనదైన ముద్ర వేసిన వ్యక్తిగా బళ్లారి రాఘవ తెలుగు ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచారని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి టి.సీతారామమూర్తి, సంగీత కళాశాల ప్రిన్సిపాల్‌ పి.శ్రీనివాస శర్మ తదితరులు పాల్గొన్నారు.

పోలీసు కార్యాలయంలో..

కంబాలచెరువు: జిల్లా పోలీసు కార్యాలయంలో నాటక రచయిత, నటుడు బళ్లారి రాఘవ జయంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి అడిషనల్‌ ఎస్పీలు ఎంబీఎస్‌ మురళీకృష్ణ, ఎల్‌.అర్జున్, ఎల్‌.చెంచిరెడ్డి, ఇతర అధికారులు, సిబ్బంది పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా అడిషనల్‌ ఎస్పీలు మాట్లాడుతూ తన సమయాన్ని, సంపదను నాటక రంగ పురోగతికి వెచ్చించిన మహోన్నత వ్యక్తి బళ్లారి రాఘవ అని, ఆయన చేసిన సేవలు నేటితరం యువతకు ఆదర్శంగా నిలుస్తాయన్నారు.

సైబర్‌ నేరగాళ్ల ఉచ్చులో పడొద్దు

కంబాలచెరువు: సైబర్‌ నేరగాళ్ల ఉచ్చులో పడొద్దని, మాదక ద్రవ్యాల జోలికి పోవద్దని అడిషనల్‌ ఎస్పీ ఎంబీఎం మురళీకృష్ణ సూచించారు. సైబర్‌ నేరాలు, యాంటీ డ్రగ్స్, మహిళల రక్షణ తదితర అంశాలపై శనివారం పేపరు మిల్లు హైస్కూల్లో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా అడిషనల్‌ ఎస్పీ మురళీకృష్ణ మాట్లాడుతూ ప్రస్తుతం మొబైల్‌ లోనే ప్రపంచం అంతా ఉందని, ఫలితంగా సైబర్‌ నేరాలు రోజు రోజుకూ పెరిగిపోతున్నాయన్నారు. టెక్నాలజీని వాడుకుని నేరగాళ్లు డబ్బులు దోచుకుంటున్నారని, వాట్సాప్, ఫేస్‌బుక్, ఇతర యాప్‌లు, లింకులు, ఈ మెయిల్స్‌తో హ్యాకర్లు మోసాలకు పాల్పడుతున్నారన్నారు. విద్యార్థులు, యువకులు అనవసర లింక్‌లను క్లిక్‌ చేయవద్దన్నారు. గుర్తుతెలియని, అపరిచిత వ్యక్తులతో ఫోన్‌ కాల్స్, వాట్సాప్, ఫేస్‌బుక్, చాటింగ్‌కు దూరంగా ఉండాలని, ఓటీపీలు వస్తే ఎవరికీ చెప్పవద్దన్నారు. సైబర్‌ నేరాలకు గురైనప్పుడు 1930 ట్రోల్‌ఫ్రీ నంబర్‌కు తెలియజేయాలన్నారు. డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.సైబర్‌క్రైం.గవ్‌.ఇన్‌ వెబ్‌సైట్‌లో ఫిర్యాదు చేయాలన్నారు. కార్యక్రమంలో సెంట్రల్‌ జోన్‌ డీఎస్పీ కె.రమేష్‌ బాబు, మహిళా పోలీసు స్టేషన్‌ సీఐ మంగాదేవి, సెంట్రల్‌ జోన్‌ శక్తి టీమ్‌ ఇన్‌చార్జి రామకృష్ణ, పేపర్‌ మిల్లు ఎగ్జిక్యూటివ్‌ డైరెక్టర్‌ ముఖేష్‌ జైన్, సెక్రటరీ బి.జయకుమార్, సింకు తాతారావు, సైబర్‌ ల్యాబ్‌ సిబ్బంది పాల్గొన్నారు.

వైఎస్సార్‌ సీపీ కడియం మండల కమిటీ నియామకం



యాదల సతీష్‌చంద్ర స్టాలిన్, మండల అధ్యక్షుడు

కడియం: వైఎస్సార్‌ సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌ రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ కడియం మండల కమిటీని నియమించారు. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం శనివారం ప్రకటన విడుదల చేసింది. కడియం మండల అధ్యక్షుడిగా యాదల సతీష్‌చంద్ర స్టాలిన్, ఉపాధ్యక్షులుగా కొత్తపల్లి శివాజీ, కుసునూరి సత్యనారాయణమూర్తి, జనరల్‌ సెక్రటరీలుగా గారపాటి వెంకటరమణమూర్తి, కాగిత విజయకుమార్, సంగీత వెంకటేశ్వరరావు, కోశాధికారి బోడా అచ్యుత రామయ్య, సెక్రటరీలుగా రాణాహరిశ్చంద్ర, బైవరపు నాగేశ్వరరావు, ఆలమూరు శ్రీనివాస్, చిలుకూరి రామకృష్ణ, బళ్లా అన్నవరం, ఎగ్జిక్యూటివ్‌ మెంబర్లుగా పితాని శ్రీనివాస్, అన్నందేవుల శ్రీను, కామిరెడ్డి సత్యకృష్ణ, సానబోయిన ఈశ్వర్, కవల జోసఫ్, నరమామిడి బాలరాజు, జలగం గంగాచలం, మామి సతీష్‌ కుమార్, ముసునూరి వెంకట రామచంద్రమూర్తి, మెల్లిమి భాస్కరరావు, కుసునూరి సత్యనారాయణమూర్తి (బాబులు), పున్నమిరాజు వీర్రాజు, బోడపాటి సత్తిబాబు, కొత్తపల్లి వెంకన్న, బచ్చు రామకృష్ణారావు, మాడ మల్లిబాబు, అయితిరెడ్డి తాతయ్యకాపు, కాపకాయల హనుమంతు నియమితులయ్యారు.

వరద ఫౌండేషన్‌ సేవలు ప్రశంసనీయం



నగదు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందుకున్న విద్యార్థులతో డీఆర్‌ఓ సీతారామమూర్తి, డీఈవో వాసుదేవరావు, డిప్యూటీ కలెక్టర్‌ వరద సుబ్బారావు

కడియం: ఏటా విద్యార్థులకు ఆర్థిక సాయం, ప్రోత్సాహక బహుమతులు అందిస్తున్న వరద ఫౌండేషన్‌ వ్యవస్థాపకులు వరద సుబ్బారావు వారి తల్లిదండ్రులు దుర్గారావు, లక్ష్మి సేవలు ప్రశంసనీయమని జిల్లా రెవెన్యూ అధికారి ఎం.సీతారామమూర్తి, జిల్లా విద్యాశాఖ అధికారి వాసుదేవరావు అన్నారు. రాష్ట్ర అసెంబ్లీ చీఫ్‌ విప్‌ జి.ఆంజనేయులుకు డిప్యూటీ కలెక్టర్‌ హోదాలో ఓఎస్‌డీగా పనిచేస్తున్న వరద సుబ్బారావు ఆహ్వానం మేరకు శనివారం కడియం హైస్కూల్లో జరిగిన ఈ కార్యక్రమానికి వారు ముఖ్య అతిథులుగా విచ్చేశారు. 2024– 25 విద్యా సంవత్సరం కడియం ఉన్నత పాఠశాలలో పదవ తరగతి చదివి 500 మార్కులు పైబడి సాధించిన 28 మంది విద్యార్థులకు, ఇంటర్మీడియట్‌లో ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించిన నలుగురు విద్యార్థినులకు, గత సంవత్సరం 6 నుంచి 9 తరగతులలో ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించిన బహుమతులు అందించారు. సభాధ్యక్షులు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు టి.సత్యనారాయణ, మండల అభివృద్ధి అధికారి కె.రమేష్, తహసీల్దార్‌ సునీల్, ఎంఈఓ నాగేశ్వరరావు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత గొల్లపల్లి సత్యనారాయణ ఆలపించిన పద్యాలు అందరినీ ఆకట్టుకున్నాయి.

మోటారు సైకిళ్లు ఢీకొని వ్యక్తి మృతి

కంబాలచెరువు: కోరుకొండ రోడ్డులోని అపోలో ఫార్మసీ వద్ద శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో లలితానగర్‌కు చెందిన క్లాసికల్‌ డ్యాన్సర్‌ పోలు నాగరాజు (43) మృతి చెందాడు. నాగరాజు స్కూటర్‌పై జయకృష్ణపురం వైపు వస్తున్నాడు. అదే ఎదురుగా మరో వ్యక్తి బైక్‌పై వచ్చాడు. వీరిద్దరూ ఎదురెదురుగా బలంగా ఢీకొన్నారు. ఈ సంఘటనలో నాగరాజు తలకు తీవ్రగాయాలయ్యాయి. ఆసుపత్రికి తీసుకెళ్లేసరికి అతను మృతి చెందాడు. మూడో పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రూ.25 లక్షలకు టోకరా

తమ రెస్టారెంట్‌కు గుగూల్‌ రేటింగ్‌లు ఇస్తే డబ్బులు ఇస్తామని చెప్పి గుర్తుతెలియని వ్యక్తులు లలితానగర్‌కు చెందిన పేపర్‌ మిల్‌ ఉద్యోగి కుర్లశెట్టి చిరంజీవి బ్యాంకు ఖాతాలో రూ.25 లక్షలు కాజేశారు. వివరాల్లోకి వెళితే.. చిరంజీవి వాట్సాప్‌కు మే 19న మెసేజ్‌ వచ్చింది. దాన్ని క్లిక్‌ చేశాడు. తమ హోటల్‌కు రేటింగ్‌ ఇచ్చి ఆదాయం పొందవచ్చని అందులో ఉంది. ఆ ప్రకారం చేస్తుండగా కొందరు అపరిచిత వ్యక్తులు ఫోన్‌ చేసి ఓటీపీలు చెప్పమన్నారు. వారు చెప్పినట్లు నాగరాజు చేశాడు. ఈ క్రమంలో అతడి బ్యాంకు ఖాతా నుంచి సొమ్ములు మాయమయ్యాయి. బాధితుడి ఫిర్యాదు మేరకు మూడో పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

జీజీయూ అధ్యాపకురాలికి పురస్కారం



డాక్టర్‌ అతిథి అభిషేక్‌ని అభినందిస్తున్న జీజీయూ చాన్సలర్‌ చైతన్యరాజు తదితరులు

రాజానగరం: స్థానిక గోదావరి గ్లోబల్‌ యూనివర్సిటీ (జీజీయూ)లో ఆంగ్ల అధ్యాపకురాలిగా పనిచేస్తున్న డాక్టర్‌ అతిథి అభిషేక్‌కి 'దేవభూమి రాష్ట్రీయ రత్న పురస్కార్‌ – 2025' లభించింది. ఈ విషయాన్ని జీజీయూ చాన్సలర్‌ కేవీవీ సత్యనారాయణరాజు (చైతన్య రాజు) తెలిపారు. ఆయన శనివారం విలేకరులతో మాట్లాడుతూ సోషల్‌ ఫార్మ్‌ అండ్‌ హయర్‌ ఎడ్యుకేషన్‌ ఇన్‌స్టిట్యూట్‌ అండ్‌ ది ఇన్‌స్టిట్యూట్‌ ఆఫ్‌ ఇంజినీర్స్‌ (డెహ్రాడూన్‌) ద్వారా విద్యా సమాజానికి సహకారం అనే విభాగంలో ఈ పురస్కారాన్ని అందజేశారన్నారు. ఈ సందర్భంగా ఆమెను జీజీయూ చాన్సలర్‌తో పాటు వీసీ డాక్టర్‌ యు.చంద్రశేఖర్, తదితరులు అభినందించారు.

అవినీతిపై ఎమ్మెల్యే స్పందించాలి


- ఆధారాలతో ప్రశ్నించినా మౌనం వీడకపోవడం దారుణం
- మాజీ ఎమ్మెల్యే డాక్టర్‌ సూర్యనారాయణరెడ్డి ధ్వజం



డాక్టర్‌ సత్తి సూర్యనారాయణరెడ్డి, మాజీ ఎమ్మెల్యే

అనపర్తి: ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి స్వగ్రామమైన రామవరంలో గోవా క్యాసినో తరహాలో నిర్వహిస్తున్న పేకాట క్లబ్‌పై జరిగిన ఎన్‌ఫోర్స్‌మెంట్‌ పోలీసుల దాడిపై ఆయన ఇప్పటి వరకు స్పందించకపోవడంతో నియోజకవర్గ ప్రజలు విస్మయాన్ని వ్యక్తం చేస్తున్నారని మాజీ ఎమ్మెల్యే డాక్టర్‌ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. అనపర్తిలోని పార్టీ కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రామవరంలో ఆయన సోదరుడు గోపాలకృష్ణారెడ్డి యాజమాన్యంలోని స్థలంలో గోవా క్యాసినో తరహాలో కాయిన్స్‌తో ఒక్క కాయిన్‌కు రూ.500 నుంచి రూ.5 వేల వరకూ విలువ నిర్ణయించి పేకాట క్లబ్‌ నడుస్తుండగా పోలీసులు దాడి చేసి 27 మందిని అరెస్ట్‌ చేశారన్నారు. కార్లు, బైకులు, పెద్ద మొత్తంలో నగదును స్వాధీనం చేసుకున్నారన్నారు. ఈ విషయమై ఆధారాలతో పాటు ప్రశ్నించినా ప్రతి స్పందించాల్సిన ఎమ్మెల్యే మౌనం వీడకపోవడం గమనార్హమన్నారు. ప్రతి చిన్న విషయాన్ని గంటల తరబడి సోదాహరణంగా వివరించే ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి.. నియోజకవర్గంలో ఇప్పటికి నిరాటంకంగా జరుగుతున్న అక్రమ మట్టి తవ్వకాలు, మద్యం షాపుల నుంచి ముడుపులు, జూదశాలల వంటి అవినీతి కార్యక్రమాలపై స్పందించకపోవడం తగదన్నారు. తన అనుచరులతో ఆ విషయాలను పక్కదోవ పట్టించడం చూస్తుంటే ఆయన ప్రమేయంపై పూర్తి అంగీకారం తెలియచేస్తుందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రామవరం, కుతుకులూరు, పాలమూరు తదితర గ్రామాల్లోనూ స్థానికుల ఒత్తిడి మేరకు పేకాట క్లబ్‌లపై పోలీసులు దాడులు నిర్వహించారన్నారు. ఈ అక్రమ కార్యకలాపాల ద్వారా వచ్చిన లక్షల రూపాయల ముడుపుల్లో సింహభాగం అంతఃపురానికి ఏరోజుకారోజు చేరుతాయని వారి కార్యకర్తలే బహిరంగంగా చెబుతున్నారన్నారు. ఇప్పటి వరకు కేవలం పేకాట ద్వారానే రూ.8 కోట్లకు పైగా ముడుపులు అందాయని ఆరోపించారు.

అవగాహన లేక వెనుకబాటు



సమావేశంలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్‌ తిరుపాణ్యం

సీటీఆర్‌ఐ: ఉన్నత శిఖరాలు అధిరోహించాలనే ఆశయం ఉన్నప్పటికీ సరైన అవగాహన లేక విద్యార్థులు వెనుకబడుతున్నారని ఎస్‌కేవీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌ డాక్టర్‌ బీవీ తిరుపాణ్యం అన్నారు. స్థానిక ఎస్‌కేవీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం ఇంటర్‌ విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు సరైన మార్గదర్శకం లేక, చదువు పూర్తయ్యాక ఉద్యోగాలు రాక అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. భవిష్యత్తు బాగుండాలంటే విద్యార్థులు ఉన్నత విద్యపై దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో వైస్‌ ప్రిన్సిపాల్‌ డాక్టర్‌ వై.స్వర్ణశ్రీ, కోఆర్డినేటర్‌ జి శరత్‌ బాబు, ప్లేస్‌మెంట్‌ సెల్‌ డైరెక్టర్‌ డాక్టర్‌ పీవీబీ సంజీవరావు, కాంపిటేటివ్‌ సెల్‌ కన్వీనర్‌ ఎంఎస్‌ ఫణికుమార్‌ పాల్గొన్నారు.

శిక్షణతో ఉత్తమ ఫలితాలు సాధించాలి

రాజానగరం: శిక్షణను సద్వినియోగపరచి, ఉత్తమ ఫలితాలు పొందాలని ప్రాంతీయ విద్యా సంచాలకులు (ఆర్‌జేడీ) జోన్‌–2 ఎ.నాగరత్నం అన్నారు. మండలంలోని మల్లంపూడి సాయిమాధవి ఇంజినీరింగ్‌ కళాశాల భవనాలలో కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాలకు చెందిన కాంట్రాక్టు ఉపాధ్యాయులకు ఆరు రోజులుగా జరుగుతున్న వృత్యంతర శిక్షణ తరగతులు శనివారంతో ముగిశాయి. జిల్లా సమగ్ర శిక్షా ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో 12 జిల్లాలకు చెందిన 182 మంది ఉపాధ్యాయులు, రీసోర్సుపర్సన్లకు ఆంగ్ల బోధనలో మెళకువలు, విద్యార్థి కేంద్రీకృత బోధన, ఆధునిక బోధన పోకడలు, కృత్యాధార బోధన, పాఠశాలలో విద్యార్థుల సామర్థ్యాల పెంపు మున్నగు వాటిలో శిక్షణ ఇచ్చారు.

సైబర్‌ నేరాలపై అవగాహన

బిక్కవోలు: మండలంలోని బిక్కవోలు ఉన్నత పాఠశాల విద్యార్థులు సైబర్‌ నేరాలపై శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ట్రైనింగ్‌ ఎస్సై వి.రవీంద్రబాబు మాట్లాడుతూ సైబర్‌ నేరాలు అంటే ఏమిటి, వాటి వల్ల జరిగే అనర్థాలను వివరించారు. ఇంటి వద్ద తల్లిదండ్రులకు వీటి గురించి వివరించాలన్నారు. కార్యక్రమంలో ఎ.సత్యనారాయణ, ఎ.సురేష్‌ కుమార్, ఎస్‌. శ్రీసత్య, పాఠశాల హెచ్‌ఎం రమాదేవి, ఉపాధ్యాయుడు శ్రీనివాస ప్రసాద్‌ పాల్గొన్నారు.